నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 14 మార్చి 2025 | పేజీలు 8

# 'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు


డీఈఓ
డాక్టర్ రాజా బాలాజీరావు

- పరీక్షలకు 33,433 మంది హాజరు
- అత్యంత సమస్యాత్మక సెంటర్లలో సీసీ కెమెరాలతో నిఘా
- పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు సరఫరా
- పౌష్టికహారం పిల్లలకు పెట్టాలని తల్లితండులకు డీఈఓ పిలుపు
- 'సూర్య' ప్రతినిధితో జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ రాజా బాలాజీరావు

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు అధికార యంత్రంగం పగడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా 'సూర్య' ప్రతినిధితో జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ రాజా బాలాజీరావు ముచ్చట్టించారు. వివరాలిలా ఉన్నాయి.

**సూర్య : పది పరీక్షలకు ఏర్పాట్లు ఎలా ఉన్నాయి ?**
డీఈఓ : అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఆహ్లాదపూర్వకంగా పరీక్షలు రాసేవిధంగా ఏర్పాట్లు చేశాం. తాగునీరు, స్నాక్స్ పంపిణీ చేయడం జరుగుతుంది. విద్యార్థులు ప్రశాంతంగా ఎలాంటి టెన్షన్ పడకుండా పరీక్షలు రాయాలి. తల్లితందులు వారి పిల్లలకు పౌష్టికహారాన్ని అందించాలని కోరారు.

**సూర్య : జిల్లావ్యాప్తంగా మొత్తం ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు ?**
డీఈఓ : జిల్లావ్యాప్తంగా 174 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. 1968 మంది ఇన్విజిలెటర్‌లను నియమించాం. 174 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను ఏర్పాటు చేయడం జరిగింది.

**సూర్య : పరీక్ష కేంద్రాలలో కొన్ని అత్యంత సమస్యాత్మకమైనవి ఉన్నాయి కదా ?**
డీఈఓ : జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా, కేవలం 7 కేంద్రాలు అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించాము. అత్యంత సమస్యాత్మకమైన పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 24 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశాం.

**సూర్య : జిల్లాలో మొత్తం ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు ?**
డీఈఓ : ఈ పరీక్షలకు 33,433 మంది హాజరువుతున్నారు. పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతుంది. విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా తీసుకొని రావాలి.

### బారాషాహీద్ దర్గా ముఖ్య ద్వారాల
# పనులకు శంకుస్థాపన

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని బారాషాహీద్ దర్గా ముఖ్య ద్వారాలకు రూ.85 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఆనంద్, నగర కమీషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ తహసిన్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి పథంలో రాష్ట్రంలోనే నెంబర్ 1గా నిలుపుతాడన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చే కళ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఉందన్నారు. బారాషాహీద్ దర్గాలో ముఖద్వారాలకు అడిగిన వెంటనే నిధులు ఇచ్చి పనులు చేపట్టామంటే దానికి ప్రధాన కారణం జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు నెల్లూరు రూరల్ ప్రజల పక్షాల ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. బారాషాహీద్ దర్గా అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



- శిథిలావస్థలో మర్రిపాడు తహసిల్దార్ కార్యాలయం
- పెచ్చులూడుతున్న వైనం
- మౌలిక సదుపాయాలు లేక ప్రజల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

# పైపైన మెరుగులు.. లోలోన అవస్థలు !

**మర్రిపాడు మండలం అంటే జిల్లాలోనే కాదు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉండే మండలం. కారణం మేకపాటి కుటుంబీకులతో పాటు ప్రస్తుత రాష్ట్ర మంత్రి ఆనం ప్రాతినిధ్యం వహిస్తున్న మండలం కూడా. ఈ మండలాన్ని గత 30 ఏళ్ల నుండి ఉద్దండులు పరిపాలన చేసిన మండలం. అయితే నిత్యం సమస్యల మీద పరిష్కారం కోసం వచ్చే తాసిల్దార్ కార్యాలయాన్ని గాలికి వదిలేయడంతో అది కాస్త శిథిలావస్థకు చేరుకుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఆ భవనం వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో ఆ కార్యాలయంలో పని చేసే అధికారులు పైపైన మెరుగులు దిద్దుతూ.. లోన భయాందోళన చెందుతూ విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయానికి వచ్చిన ప్రజలకు మౌలిక సదుపాయాలు కూడా కరువవడంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.**

**- వివరాల్లోకి వెళితే..**

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :**


పెచ్చులూడిన దృశ్యం

జిల్లాలోనే అతి పెద్ద మండలం మర్రిపాడు మండలం. ఈ మండలంలో 24 పంచాయతీలు 40 గ్రామాలు ఉన్నాయి. అయితే మండల పరిధిలోని ఆ గ్రామాల్లో ప్రధానంగా భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం తహసిల్దార్ కార్యాలయానికి రావాల్సి ఉంది. అయితే ఆ కార్యాలయం వద్ద సమస్యల కోసం వచ్చిన ప్రజలకు, బాధితులకు మౌలిక సదుపాయాలు కరువవడంతో నానా తంటాలు పడుతున్నారు. కనీసం కార్యాలయానికి వచ్చిన వారికి తాగునీరు కూడా లేకపోవడంతో మర్రిపాడు సెంటర్‌కు వెళ్లి కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేకించి మహిళలకు ఆ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని మహిళలు ఆరోపిస్తున్నారు. దీంతోపాటుగా కార్యాలయం చుట్టూ ప్రహరీ కూడా లేకపోవడంతో ఆకతాయిలకు నివాసంగా మారిపోయింది. ఈ నేపథ్యంలోనే కార్యాలయానికి ఉన్న జనరేటర్ కూడా మరమ్మతులకు గురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు పనులు కాక గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా వర్షాకాలంలో గదుల గోడలు ఉరుస్తూ.. పైన స్లాబు నుంచి కారుతూ ఉంటుండడంతో అధికారులు విధులు నిర్వహించడం కష్టతరమైంది.

-మిగతా 2లో

### శ్రీనివాస కళ్యాణోత్సవానికి
# మంత్రిని ఆహ్వానించిన టీటీడీ ఈఓ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఈనెల 15న వెంకటపాలెంలో నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి టీటీడీ ఈఓ, జేఈవోలు అధికారికంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంతో టీటీడీ అధికారులు సమావేశమై కళ్యాణోత్సవ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, స్వామివారి కళ్యాణ వేదిక ఏర్పాట్ల గురించి వివరంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రమబద్ధమైన ఏర్పాట్లు జరిగేలా జాగ్రత్త వహించాలని మంత్రి ఆనం సూచించారు.

### దేశ చరిత్రలోనే తొలి మహిళా
# కవయిత్రి మొల్లమాంబ




వివరాలు 02లో

# దేశ చరిత్రలోనే తొలి మహిళా కవయిత్రి మొల్లమాంబ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలోనే మొదటి మహిళా కవయిత్రిగా మొల్లమాంబది ప్రత్యేక స్థానం అన్నారు. మొల్లమాంబ కవిత్వం సరళమైంది గాను, రమణీయమైందిగాను ప్రసిద్ధిగాంచిందని, రామాయణ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించిన తొలి మహిళా విదుషీమణి మొల్లమాంబ అన్నారు. కుమ్మరి కుటుంబంలో జన్మించి, ప్రాచీన భారతావనిలో అనేక కట్టుబాట్లు, ఆటుపోటులు ఎదుర్కొని మహిళా కవియిత్రిగా రాణించిన మొల్లమాంబ తెలుగుజాతికే గర్వకారణం అన్నారు. మొల్లమాంబ తెలుగులో రచించిన మొల్ల రామాయణం ఇప్పటికే అత్యంత ప్రసిద్ధికెక్కిన గ్రంథాలలో ఒకటి అని, తెలుగుజాతి గొప్పతనాన్ని కీర్తిని విశిష్టతను 16వ శతాబ్దంలోని లోకానికి చాటి చెప్పిన వీర వనిత మొల్లమాంబ అన్నారు. మహానేత వైయస్.రాజశేఖర్ రెడ్డి కోరిక ఆనాటి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో, తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించిందన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కృషి మేరకు 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం'ను నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి, తాత్కాలిక భవంతిలో ప్రారంభించారన్నారు. చంద్రబాబు నాయుడు 2014 నుండి 2019 వరకు అధికారంలో ఉన్నా, ప్రతిపక్ష శాసనసభ్యునిగా ఎన్ని విజ్ఞప్తులు చేసినా, స్థలం కేటాయించలేకపోయాడు. కేంద్ర ప్రభుత్వం భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నా, స్థల సేకరణ పూర్తి కాకపోవడంతో 'తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం' సమగ్రంగా పరిశోధనలు నిర్వహించడానికి శాశ్వత భవనాలు లేకుండా పోవడం అడ్డంకిగా మారిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత స్థల సేకరణ పనులు ఊపందుకున్నాయని, స్థల సేకరణ పనులు ప్రారంభించగానే కొంత మంది కోర్టుకు వెళ్లి, స్థల కేటాయింపును అడ్డుకున్నారన్నారు. అధికార పార్టీ శాసన సభ్యునిగా కోర్టు కేసులన్నీ పరిష్కరించుకొని, మార్కెట్ ధర నిర్ణయించి, ప్రభుత్వ అనుమతి కోసం నాటి కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారన్నారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక, జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలోనే ప్రభుత్వ మార్కెట్ ధరకు భూములు కేటాయించడానికి అంగీకారం తెలిపామన్నారు. కేంద్ర ప్రభుత్వం భూ కేటాయింపులకు ఎటువంటి పరిహారం చెల్లించలేమని, భూమిని ఉచితంగా అందిస్తేనే, నిధులు విడుదల చేసి భవన నిర్మాణాలు మొదలుపెడతామని మెలిక పెట్టిందన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి మరుసటి క్యాబినెట్ సమావేశంలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్కెట్ విలువతో సంబంధం లేకుండా ఉచితంగా భూమి కేటాయించాలని ప్రతిపాదించి ఆమోదింపజేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి సంకల్పం, నా కృషితో 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' సర్వేపల్లి ప్రాంతం నుండి తరలిపోకుండా, శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు దోహదపడిందన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచేందుకు, 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' ఏర్పాటుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. మొల్లమాంబ జయంతిని వేడుకగా నిర్వహించ తలపెట్టి, రాష్ట్ర పండుగగా ప్రకటించిన జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర వెనుకబడిన వర్గాలతోపాటు, నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సోమిరెడ్డిని పరామర్శించిన ఆదాల ప్రభాకర్ రెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం సోమిరెడ్డి రాధాకృష్ణారెడ్డిని పరామర్శించారు. రాధాకృష్ణారెడ్డి సతీమణి సోమిరెడ్డి భువనేశ్వరమ్మ ఇటీవల కాలం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరంలోని సరస్వతి నగర్‌లోని వారి నివాసంలో మాజీ ఎంపీ అదాల ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అలాగే నెల్లూరు రూరల్ మండలంలోని పెను బర్తి గ్రామంలో గురువారం సాయంత్రం పలువురిని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ముందుగా మాజీ ఎంపీ ఆదాల పెనుబర్తి గ్రామ ఉప సర్పంచ్ వేదనపర్తి వెంకటేశ్వర్లురెడ్డి తల్లి రాజమ్మ ఇటీవల కాలం చేసిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మోపూరు మోహన్ రెడ్డి తల్లి రామసుబ్బమ్మ ఇటీవల కాలం చేసిన నేపథ్యంలో ఆదాల ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశా రు. పరామర్శించిన వారిలో నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు రూరల్ పార్టీ అధ్యక్షులు పుచ్చలపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలివెలపాలెం మాజీ సొసైటీ డైరెక్టర్ పార్లపల్లి వీర రాఘవరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, మల్లు సుధాకర్ రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, ఏసునాయు డు, మంగళపూడి శ్రీకాంత్ రెడ్డి, కొండేటి నరసింహారావు, స్వర్ణ జీవన్ ప్రసాద్, నాగ శ్రీనివాసులు రెడ్డి, వైవి రెడ్డి, శ్రీధర్ బాబు, కల్లూరు లక్ష్మీరెడ్డి, షేక్ అల్లా బక్షు, బెల్లంకొండ వెంకయ్య, నాని తదితరులు ఉన్నారు.

# పైపైన మెరుగులు.. లోలోన అవస్థలు !



(మొదటి పేజీ తరువాయి)

పైన స్లాబు నుంచి కారుతూ ఉంటుండడంతో అధికారులు విధులు నిర్వహించడం కష్టతరమైంది.

## పెచ్చులూడుతున్న భవనం..

మర్రిపాడు తహసిల్దార్ కార్యాలయ భవనం రోజురోజుకి ప్రమాదపుటంచున చేరుకుంటుంది. పైన స్లాబ్ పెచ్చులూడి దర్శనమిస్తోంది. దీంతో ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అధికారులు భయాందోళన చెందుతూ విధులు నిర్వహించక తప్పడం లేదు. గత 40 ఏళ్ల నుండి ఆ భవనానికి ఎటువంటి మరమ్మత్తులు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ తహసిల్దార్ కార్యాలయంలోనే మండల పరిషత్ కార్యాలయం కూడా ఉమ్మడిగా ఉండేది. కాలక్రమేణా మండల పరిషత్ కార్యాలయానికి నిధులు వెచ్చించి ప్రత్యేకంగా కార్యాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి తహసిల్దార్ కార్యాలయాన్ని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొని దర్శనమిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్క తహసిల్దార్ కార్యాలయం మాత్రమే ఎలా ఉండడంతో అధికారులు ఇటీవల జరిగిన జనవరి 26కి పైపైన మెరుగులు దిద్ది కాలం గడిపారు. అది కూడా ముందు భాగం వరకే రంగులు వేయడంతో కొత్త కార్యాలయంగా కనిపిస్తుండడం విశేషం. అందువలన పాలకులు ఉన్నతాధికారులు గమనించి భవన నిర్మాణానికి నాంది పలకాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జిల్లాలో 5864 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



- 24 నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ
- దళారుల మాట విని ధాన్యాన్ని తక్కువకు అమ్ముకోవద్దు
- జాయింట్ కలెక్టర్ కార్తీక్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 5864.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 927 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ.. 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ధాన్యం డబ్బులు కూడా చాలా ఆలస్యంగా వస్తాయని, ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు రోజుల్లోనే డబ్బులు జమవుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ పిలుపునిచ్చారు.

# రీసర్వేలో అటవీ అధికారులు భాగస్వాములు కావాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో అటవీ అధికారులు భాగస్వాములై ఆయా భూముల వివాదాల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆనంద్ కోరారు. గురువారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో అటవీ, వన్యప్రాణుల రక్షణ పై సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సమావేశ ఉద్దేశాలను జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ వివాదాల విషయమై రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో అవసరమైన గ్రామాల్లో అటవీ అధికారులు సైతం హాజరై భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఆక్రమణకు గురైన అటవీ భూముల విషయంలో కోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణ ప్రాంతాల్లో తొందరపడి చర్యలు తీసుకోవద్దని సూచించారు. అదేవిధంగా నగర వనాల అభివృద్ధి గురించి చర్చిస్తూ.. నెల్లూరు నగరంలోని నగర వనానికి వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు సందర్శించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మిగతా నగర వనాలను కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డివోలు అనూష, పావని, వంశీకృష్ణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# బారాషహీద్ దర్గాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేద్దాం


**- జిల్లా కలెకక్టర్ ఓ.ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దక్షిణ భారతదేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా బారాషహీద్ దర్గాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. బుధవారం సాయంత్రం బారాషహీద్ దర్గా ఉత్తర, దక్షిణ ముఖద్వారాల నిర్మాణ పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ సూర్యతేజతో కలిసి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నుడా, మున్సిపల్ కార్పొరేషన్‌లో అందుబాటులో వున్న నిధులను వినియోగించి దర్గా ఆర్చి నిర్మాణ పనులు మొదలుపెడుతున్నట్లు చెప్పారు. దక్షిణభారతదేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా బారాషహీద్ దర్గా సమగ్ర అభివృద్ధికి పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి టూరిజం డిపార్టుమెంటుకు పంపనున్నట్లు చెప్పారు. దర్గాలో మసీదు నిర్మాణానికి ముఖ్యమంత్రి గారు మంజూరు చేసిన 5కోట్ల నిధుల మంజూరుకు కూడా కృషిచేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 85లక్షలతో ఆర్చి నిర్మాణ పనులను తమ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. రొట్టెలపండుగ నాటికి ఈ ఆర్చి నిర్మాణాలు పూర్తి చేసి దర్గాకు సరికొత్త శోభన తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. మసీదు నిర్మాణానికి కూడా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్చి నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి చేసిన కలెక్టర్, కమిషనర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి పనులకు ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చి నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నెంబర్‌వన్‌గా నిలుపుతాడన్నారు. బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సూచనల మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు**

# జర్నలిస్ట్ ఇంట వివాహ సందడి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో సీనియర్ జర్నలిస్ట్ బైనబోయిన వెంకటేశ్వర్లు–రమాదేవి దంపతుల కుమారుడు ప్రశాంత్ కుమార్‌కు, సోమశిలకు చెందిన గుండుబోయిన వెంకటరమణ–సుబ్బమ్మ దంపతుల కుమార్తె భార్గవికి బుధవారం రాత్రి స్థానిక శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం జరిగింది. గుండుబోయిన కిషోర్ కుమార్–భైమావతి దంపతులు, ఆనంగి శ్రావణ్ కుమార్–శాంతిలత దంపతులు, బైనబోయిన శ్రీకాంత్‌లు కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ కళ్యాణోత్సవంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిద శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులంతా హాజరై వధూవరులను ఆశీర్వదించి వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పిటిసి మెంబర్ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి–శ్రీనివాసులు నాయుడు దంపతులు, అనంతసాగరం మండల జెడ్పిటిసి మెంబర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య–మంజూషా దంపతులు, తెలుగు దేశం నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, దావా పెంచలరావు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, చంద్రా వెంకటసుబ్బానాయుడు, గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్, రాచాల రవికుమార్‌యాదవ్, కేతా విజయభాస్కరరెడ్డి, పులిమి శైలజారెడ్డి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, తోడేటి వెంకటయ్య, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, కొప్పోలు రమాదేవి, పొడమేకల పెంచలయ్యయాదవ్, గంధళ్ళవేణు, మొలబంటి రాజశేఖర్, దగ్గుమాటి శివకోటారెడ్డి, వైసిపి నాయకులు రాపూరు సుందరరామిరెడ్డి, సద్దా రవికుమార్‌రెడ్డి, అక్కలరెడ్డి అంకిరెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, డిఎస్‌పి వేణుగోపాల్, సీఐలు జి.గంగాధర్, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు జిలాని, సాయిప్రసాద్, మున్సిపల్ కమీషనర్లు సి.గంగాప్రసాద్, ఎం.రమేష్‌బాబు, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, చెరుకూరు రమణయ్యనాయుడు, శ్రీలక్ష్మి, కంది మల్లికార్జునరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ, ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, బైనబోయిన, గుండుబోయిన కుటుంబాల బంధుమిత్రులు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చూపిన ఏఎస్‌ఆర్‌కాలేజి విద్యార్థిని

**3.8లక్షల ప్యాకేజితో ఉద్యోగానికి ఎంపిక**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఆనం సంజీవరెడ్డి డిగ్రీకాలేజి విద్యార్థిని కె.కీర్తి ప్రాంగణ ఎంపికల్లో అత్యంత ప్రతిభ చూపి 3.8లక్షల రూపాయల ఏడాది ప్యాకేజితో సిజిఐ కంపెని ఉద్యోగానికి ఎంపికైంది. గురువారం కాలేజిలో కరస్పాండెంట్ ఎం.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆ విద్యార్థినికి అభినందన సభ ఏర్పాటు చేశారు. తమ కాలేజి సిఆర్‌టి ప్రోగ్రామ్‌లో ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీ సిజిఐకు తమ విద్యార్తిని కీర్తి ఎంపికకావడం అత్యంత సంతోషదాయకమని సుబ్బారెడ్డి పేర్కొంటూ కీర్తిని అభినందించారు. ఆమెకు శాలువా, పుష్పగుచ్ఛంలతో సన్మానం చేశారు. తమ కాలేజి విద్యార్థిని అత్యంత ప్రతిభ చూపి ఉద్యోగానికి ఎంపికకావడం గర్వకారణంగా ఉందన్నారు. తమ కాలేజిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిఆర్‌టి ప్రోగామ్ ద్వారా ఈ విద్యాసంవత్సరంలో తమ విద్యార్థినీ, విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి 60మంది వివిద బహాళజాతి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సుబ్బారెడ్డి వివరించారు. తమ కాలేజిలో అభ్యశించే విద్యార్థులకు నాణ్యమైన బోధనగావిస్తూ నైపుణ్యాలను పెంపొందిస్తూ ఉద్యోగాలకు ఎంపికకావాలన్న సంకల్పంతో కొనసాగుతున్నామని ఆయన తెలిపారు. తమ కాలేజిలో డిగ్రీ చదివితేనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. తాను ఉద్యోగానికి ఎంపికకావడం సంతోషకరంగా ఉందని, తమ కాలేజి యాజమాన్యం, ఉపాధ్యాయుల ఇచ్చిన మంచి బోధన, ప్రోత్సాహంతోనే తాను ఎంపికయ్యానని కీర్తి పేర్కొంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసులు, కాలేజి డైరెక్టర్ డి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని కీర్తిని అభినందించారు. విద్యార్థులు, కాలేజి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నివ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కిడ్నివ్యాధులపట్ల అందరికి అవగాహన అవసరమని ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎంవో డాక్టర్ ఉషాసుందరి, ఈ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్ మేనేజర్ సురేంద్రలు పేర్కొన్నారు. గురువారం డయాలసిస్ సెంటర్‌లో సురేంద్ర ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్ని దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించగా డాక్టర్ శేషారత్నం, డాక్టర్ ఉషాసుందరిలు అతిధులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ థీమ్‌డిటెక్ట్‌ఎర్లీ, ప్రొటెక్ట్ కిడ్ని గురించి అందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అందరూ తగిన అవగాహనతో కిడ్నివ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించారు. కిడ్ని వ్యాధులు, లక్షణాలు, వైద్యపరిక్షలు, చికిత్సలు తదితరాల గురించి వారు వివరించారు. ప్రజలకు తగిన అవగాహన కల్పించి భవిష్యత్తులో కిడ్నివ్యాధులు తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అపోలో యాజమాన్యం ఇలాంటి సదస్సులు నిర్వహిస్తుందని సురేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, అపోలో మెడికల్ ఆఫీసర్ అనూష, నర్సింగ్ సూపర్నెంట్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలభవిత కేంద్రానికి వాహన సదుపాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని జిల్లా బాలభవిత కేంద్రానికి వాహన సౌకర్యం ఏర్పడింది. వాహనాన్ని గురువారం హాస్పిటల్ ఆర్‌ఎంవో డాక్టర్ ఉషాసుందరి జెండా ఊపి ప్రారంభించారు. దివ్యాంగులైన చిన్నారులకు ఈ కేంద్రంలో వైద్యసేవలు అందిస్తుంటారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం ఒక వాహనాన్ని కూడా సమకూర్చారు. ఈసందర్భంగా డాక్టర్ ఉషాసుందరిని బాలభవిత కేంద్ర వైద్యులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించగా ఆమె వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం సమకూరడం దివ్యాంగులకు ఎంతో సౌకర్యవంతమని వైద్యులు పేర్కొన్నారు. మానసిక సమస్యలున్న చిన్నారులను బాలభవిత కేంద్రానికి తీసుకు రావడం ఇబ్బందికరంగా ఉండగా ఆ సమస్య పరిష్కారమైందన్నారు. ఈవాహనంను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహన సదుపాయం కలిగినందున వ్యయప్రయాసలు తొలగనున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలభవిత కేంద్ర ఇన్‌చార్జ్ డాక్టర్ దినకర్, వైద్యాధికారి డాక్టర్ ఓంకారనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తెప్ప మహోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం నందు వెనుక గల కోనేరులో శ్రీ వేణుగోపాలస్వామి స్వామి వారికి, శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారికి మార్చి 16వ తేది సాయంత్రం 7గంటలకు అంగరంగ వైభవంగా తెప్ప మహోత్సవ కార్యక్రమం జరుగునని శ్రీ వేణుగోపాలస్వామి స్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేడుకకు అందరూ హాజరై స్వామి వార్ల తెప్పోత్సవం చూసి తరించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పోసింరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, నార్తు రాజుపాలెం, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం వారు వ్యవహరిస్తున్నారు.

# వైఎస్సార్‌సీపీ యువత పోరు గ్రాండ్ సక్సెస్

## వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల జిల్లా అధ్యక్షులు నాగార్జున, అశ్రిత్‌రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు నగరంలోని నిర్వహించిన యువత పోరు కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యిందని పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున అన్నారు. గురువారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. తమ పార్టీ ఇచ్చిన ఒక్క పిలుపుతో వేలాది మంది విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రజలు స్వచ్ఛంధంగా తరలి వచ్చి యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందనేందుకు ఇదోక ఉదాహరణ శాంపిల్ మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అన్ని వర్గాలతో పాటు విద్యార్థులు, యువకులకు అనేక హామీలివ్వడం జరిగిందన్నారు. ఆ హామీలను నెరవేర్చకపోవడం వలన యువకులు ఉద్యోగాలు, ఉపాధి లేక రోడ్డునపడ్డారన్నారు. యువకులు, విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే యువత పోరు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కారోనా కష్టకాలంలో కూడా ఇచ్చిన హామీలను 90శాతం నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా నేటికి విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు అందిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇదేవిధంగా కొనసాగితే మాత్రం రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తమ నాయకుల సహాయ సహకారంతో యువజన, విద్యార్థి విభాగాల సంయుక్తంగా తమ పోరాటాలని మరింత ఉధృతం చేసి కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేలా కార్యక్రమాలు చేస్తుందని ఆయన హెచ్చరించారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రియింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆతరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీర్చు గార్చిందన్నారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులు విద్యనభ్యసించేందుకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని వందశాతం అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫీజురియింబర్స్‌మెంట్‌ను మరిచిందన్నారు. దాదాపు రూ.7100కోట్లు ఫీజురియింర్స్‌మెంట్ బకాయిలు ఉండగా రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.2,600కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. అంటే కొంత మంది విద్యార్థులకు మాత్రమే ఫీజు రియింబర్స్‌మెంట్ వస్తుందని మిగిలిన విద్యార్థులను ఏం చేయదలచుకున్నారని ఆయన ప్రశ్నించారు. విద్యాసంవత్సరానికి రూ.3,900 కోట్లు ఖర్చు అవుతుందని ఇందులో రూ.2,800కోట్లు రియింబర్స్‌మెంట్‌కు ఖర్చు కాగా మిగిలిన రూ.1,100కోట్లు హాస్టల్స్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లకు ఖర్చు అవుతుందన్నారు. పరిస్థితిని ప్రజలందరూ గమనిస్తునే ఉన్నారని విద్యార్థులందరూ ఆగ్రహావేశంతో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు విద్యార్థులను విస్మరించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని విమర్శించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం లాఠీ దెబ్బలు తింటుంటే విద్యాశాఖ మంత్రి లోకేష్ మాత్రం విదేశాల్లో క్రికెట్ చూస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తానన్న డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ ప్రశ్నిస్తునారో అర్ధంకావడం లేదన్నారు. విద్యార్థులు, యువకుల పక్షాన నిలబడి వారి సమస్యలపై న్యాయపోరాటం చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

# నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడుపుతాం





## - కౌన్సిల్ సమావేశంలో మేయర్ స్రవంతి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లాకు చెందిన అందరు ప్రజా ప్రతినిధుల సహకారంతో, నెల్లూరు నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారుల పర్యవేక్షణలో నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి పేర్కొన్నారు. నగర పాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలామ్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. మేయర్ స్రవంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర పాలక సంస్థ అన్ని డివిజనుల కౌన్సిల్ సభ్యుల సమక్షంలో 68 మెయిన్ అజెండా, 15 సప్లిమెంటరీ అజెండా, 8 టేబుల్ అజెండాలుగా మొత్తం ప్రవేశపెట్టిన 91 తీర్మానాలను అజెండాగా ప్రకటించగా, అందులో 2 వాయిదా పడగా, 89 తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణ పనులు ప్రణాళికాబద్ధంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు.

కార్పొరేషన్ కమిషనర్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు నగర ప్రజలందరి సహకారంతో నెల్లూరు నగర పాలక సంస్థ ఉన్నతి సాధించేలా సమన్వయంగా కృషి చేస్తామని మేయర్ ఆకాంక్షించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు తమ డివిజన్ల పరిధిలో ప్రస్తావించిన పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైను కాలువల పూడికతీత, దోమల నిర్మూలన, కుక్కలు, పందులు, పశువుల నియంత్రణతో పాటు స్థానిక సమస్యలను, వివిధ అంశాలను పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మేయర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, సయ్యద్ తహసీన్, నగర పాలక సంస్థ అన్ని డివిజనుల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సూర్యతేజ, నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోషణ్ భీ పడాయి బీ శిక్షణ ముగింపు కార్యక్రమం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ పడాయిబీ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ముందుగా గుర్తించి వైఫల్యానికి గురికాకుండా చూడడంలో అంగన్వాడీ టీచర్ల పాత్ర గురించి, అలాగే గృహ సందర్శన ద్వారా తల్లులకు పిల్లల యొక్క స్థితిగతులను వివరించడం, ప్రీస్కూల్ అభ్యసన కార్యక్రమంలో పిల్లలు కనపరచిన ప్రతిభను అసైన్మెంట్ కార్డ్స్ ద్వారా ఈసిసిఈ డే నిర్వహించి తల్లిదండ్రులకు తెలియజేయడం వంటి విషయాల గురించి నవ చేతన గురించి సీడిపిఓ రాజ్యలక్ష్మి అంగన్వాడీ టీచర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లలితాంబ, మంజుల, టీచర్స్ పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థునులకు విద్యాసామాగ్రి పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడులోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలోని పదవ తరగతి విద్యార్థులకు గురువారం విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. ఈ విద్యాసామాగ్రినిని మర్రిపాడు ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి దివానపు నారాయణరావు కుమారుడు దివానపు లోకేష్ కుమార్ జ్ఞాపకార్థంగా విద్యార్థునులకు అందజేశారు. అనంతరం పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థునులకు మండల టిడిపి కన్వీనర్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, విద్యాలయ ప్రిన్సిపల్ లక్ష్మీదేవి చేతుల మీదుగా విద్యా సామాగ్రిని పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ అరికట్ల జనార్దన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థిని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా విద్యను అభ్యసించి ఉన్న స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్య పట్ల, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మండల స్థాయిలో మొదటి స్థానం సంపాదించిన విద్యార్థినికి 5000 రూపాయలు సొంత నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు.

## మాజీ మంత్రి మాదాలకు ఘన నివాళి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి మాదాల జానకిరామ్ 80వ జయంతి సందర్భంగా ఆయన శిష్య బృందం గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఉదయగిరి అన్నపూర్ణ నగర్‌లోని మాదాల రామచంద్రా నివాసంలో జానకిరామ్ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గొడుగులు రాయుడు మాట్లాడుతూ.. జానకిరామ్ హయాంలో ఉదయగిరి ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏకైక క్యాబినెట్ మంత్రి అయిన జానకిరామ్, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ కూడా జానకిరామ్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్నారని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, గానుగపేట రవీంద్రనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పోరంబోకు భూములకు డీకేటి పట్టాలు ఇవ్వాలి


**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని మాదరాజ గూడూరు గ్రామంలో కట్ట కింద సాగు చేసుకుంటున్న పేదల పోరంబోకు భూములకు డీకేటి పట్టాలు ఇవ్వాలని నెల్లూరు రూరల్ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల 6వ రోజు పర్యటనలో భాగంగా మాదరాజ గూడూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ.. గత 40సంవత్సరాలుగా గ్రామంలోని కట్టకింద పోరంబోకు భూములను 65 ఎకరాలను సాగు చేసుకుని జీవిస్తున్నారని గతంలో ఆన్‌లైన్‌లో ఎక్కించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే వారిని కానీ ప్రస్తుతం అడంగల్‌లో ఎక్కించకుండా ఇబ్బందులు పెడుతున్నారని, కాబట్టి కాబట్టి ఆన్‌లైన్‌లో ఎక్కించి డికెటి పట్టాల మంజూరు చేయాలని కోరారు. అనంతరం




గ్రామస్తులు గడ్డివాములు, వరి ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు శుభ్రం చేసుకున్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు రూరల్ మండలం కమిటీ సభ్యులు ఎంవి రమణ, శ్రీపతి వెంకయ్య, మబ్బు పుల్లయ్య మరిమేసి కామాక్షయ్య, శ్రీధర్, జమళ్ళ చంద్రశేఖర్, జమళ్ల సందీప్, పసల వెంకటరమణయ్య, కొర్ర పాపయ్య, సాదేపల్లి ఏడుకొండలు, మేడబల్లి పెంచలయ్య, మబ్బు ధనుంజయ, మబ్బు కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోండి

- ప్రపంచ కిడ్నీ దినోత్సవంలో అపోలో వైద్యుల పిలుపు
- నెల్లూరు అపోలో హాస్పిటల్ లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం
- డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో 100కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని, వారంతా పూర్తి ఆరోగ్యంగా జీవిస్తున్నారని అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, నెఫ్రాలజీ విభాగ అధిపతి డాక్టర్ ఏకే చక్రవర్తి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ బి.మస్తాన్ వలీ వెల్లడించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రక్తాన్ని వడపోసే కిడ్నీలు దెబ్బతింటే దాని ప్రభావం శరీరమంతా ఉంటుందని, వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కిడ్నీకి సమస్య తలెత్తిన వెంటనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ 10 మందిలో ఒకరికి కిడ్నీ సమస్య ఉంటుందని, సాధారణ వ్యక్తుల కంటే కిడ్నీ సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో భావోద్వేగాలు ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో గుర్తించినట్లు వెల్లడించారు. కిడ్నీ సమస్యలు ఎదుర్కొనే వారికి గుండెపోటు ఇతర స్ట్రోకులు, ఫ్రాక్చర్స్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కిడ్నీ సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే ఇతర జబ్బులు సోకకుండా ఉంటాయని వారు తెలియజేశారు. షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి కిడ్నీ సమస్యలు అధికంగా వస్తాయని కనుక ఆయా సమస్యలతో బాధపడే వారు సరైన చికిత్స తీసుకుంటే కిడ్నీ సమస్యలకు దూరంగా ఉండవచ్చునని చెప్పారు. పరిశుభ్రమైన మంచి నీరు తాగడం మూలంగా కూడా కిడ్నీ సమస్యలు దూరమవుతాయన్నారు. జనాభాలో 10శాతం మంది ప్రజలు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని, దీనిపై ప్రభుత్వం ఆలోచించి, కిడ్నీ సమస్యలను ముందుగానే గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కిడ్నీ సమస్యల చికిత్స, శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అపోలో హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్యుల తోపాటు అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, కిడ్నీ రోగులు అపోలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశం హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పట్టాభి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని కొడవలూరు మండలం గండవరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమీరెడ్డి పట్టాభిరామిరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ గ్రేడ్ ఏ రకం పుట్టి 19720/- నిర్ణయించబడిందని కొనుగోలు చేసిన 24 గంటల్లోపే అకౌంట్లోకి డబ్బు జమవుతుందని తెలిపారు. అలాగే రైతులు రైతు సేవ కేంద్రానికి వెళ్ళవలసిన అవసరం లేకుండానే ప్రభుత్వం యొక్క వాట్సాప్ నంబర్ 7337359375 కి మీ వాట్సాప్ నెంబర్ నుండి హాయ్ అని మెసేజ్ పెడితే మీ ధాన్యానికి షెడ్యూలింగ్ మెసేజ్ వస్తుంది. తద్వారా మీరు ధాన్యం అమ్మకానికి సిద్ధమైనట్లు పిపిసికి అందుతుందని తెలియజేశారు. దళారులు రైతుల వద్ద మద్దత్తు దరకంటే తక్కువ కొనుగోలు చేయకూడదని హెచ్చరించడం జరిగింది.

## పసికందు ప్రతిభకు కలెక్టర్ ప్రశంశాపత్రం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం రామస్వామిపల్లికి చెందిన ఆరునెలల పసికందు వస్తువులను గుర్తించడంలో అత్యంత ప్రతిభకనబరచడంతో ఆ చిన్నారికి జిల్లాకలెక్టర్ ఓ.ఆనంద్ ప్రశంశాపత్రాన్ని అందజేశారు. రామస్వామిపల్లికి చెందిన చందలూరు వీరు-ఊహ దంపతుల ఏకైక వారసుడు వీరశ్రీయాన్ కాగా ఆ బాలుడి వయసు కేవలం ఆరునెలలు మాత్రమే. ఆ బాలుడిముందు కూరగాయలు, పండ్లు, జంతువుల ఫోటోగ్రఫీలను పెట్టి ఏం పేరుచెబుతామో ఆ వస్తువును చూడడం, చేయిపెట్టడం చేస్తున్నాడు. ఈ సమాచారాన్ని ఆ తల్లిదండ్రులు నోబుల్‌వరల్డ్ రికార్డ్స్‌కు తెలియజేశారు. వారు నిర్వహించిన పరిక్షల్లో ఆ బాలుడు నెగ్గాడు. బాలుడు వీరశ్రీయాన్ ప్రతిభను గుర్తించిన నోబుల్‌వరల్డ్‌రికార్డ్స్ వారు ప్రశంశాపత్రాన్ని, పతకాన్ని అందజేశారు. ఆ మెడల్, సర్టిఫికేట్‌లను జిల్లాకలెక్టర్ ఆనంద్ చేతులమీదుగా తల్లిదండ్రులు అందుకున్నారు. చిరుప్రాయంలోనే చాకచక్యంగా వస్తువులను గుర్తిస్తున్న ఆ చిన్నారిని పలువురు అభినందించారు. కలెక్టర్ చిన్నారి శ్రీయాన్‌ను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు. పువ్వుపుట్టగనే పరిమళిస్తుందన్న నానుడికి నిదర్శనం ఈ బాలుడు వీరశ్రీయాన్ అని పలువురు కొనియాడారు.

## బాలికల్లో ఆత్మవిశ్వాసానికి 'ఆత్మరక్ష ప్రశిక్షణ్'



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆపద ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలో తెలియజేయడానికే జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్తంగా 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ' కార్యక్రమానికి రూపకల్పన చేసిందని శిక్షకులు మన్మధ, శ్రీనివాస్, శ్యామ్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాలికలకు రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా మెళుకవలు నేర్పించారు. అపరిచితులు ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలి, దొంగలు దాడి చేసినప్పుడు వారిని ఎలా ఎదుర్కోవాలనే తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్ ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, బ్రహ్మారెడ్డి, విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## 6వ రోజుతో ముగిసిన శిక్షణ కార్యక్రమం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం 'సంకల్ప' పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి మహిళ పారిశ్రామికవేత్త కావాలని సదుద్దేశ్యంతో సంకల్పించిన 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది. ఇందులో భాగంగా చెత్త నుండి సంపద సృష్టించడంలో భాగంగా అరటి బొంతల నుండి తీసిన నార ద్వారా బ్యాగులు, చీరలు, గృహోపకరణాలు మొదలైనవి తయారు చేయటం గురించి 2 బ్యాచ్‌లలో 6 రోజులు జరుగు శిక్షణా కార్యక్రమం, క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా లెగుంటపాడులోని శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇచ్చి గురువారంతో శిక్షణ పూర్తి చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.సుజాతరెడ్డి (కృషి విజ్ఞాన కేంద్రం), ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్ రావు, ఏపీఎం లవ్లీ హుడ్స్ నాగేంద్రప్రసాద్, ఇందుకూరుపేట ఏపీఎం షరిత, సీసీలు, ఎస్‌హెచ్‌జి, సభ్యులు హాజరు కావటం జరిగింది.

## రంగులు జీవితాన్ని ప్రభావితం చేస్తాయి..

- శ్రీ గాయత్రి స్కూల్లో ఘనంగా ముందస్తు హెూలీ పండుగ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రంగులు మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయని శ్రీ గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి అన్నారు. గురువారం తమ స్కూల్లో ముందస్తు హెూలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు. స్కూల్ ఆవరణమంతా రంగు రంగుల రంగవల్లికలతో నింపారు. చిన్నారులు కేరింతలు కొడుతూ ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. ఉపాధ్యాయులు సైతం పిల్లలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తమ స్కూల్లో ప్రతి డే-అండ్-ఈవెంట్స్ ను కచ్చితంగా నిర్వహిస్తామన్నారు. దాంతో పాటు ఆ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరిస్తామన్నారు. తద్వారా చదువుతో పాటు, కల్చరల్ యాక్టివిటీస్‌లో సైతం తమ విద్యార్థులు చురుకుగా వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఏడుకొండలు, బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం లక్ష్యం : ఎంపీడీఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమాలు అమలుచేస్తుందని ఆత్మకూరు ఎంపిడివో పి.ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం ఆయన నువ్వురుపాడు పంచాయతీ పరిధిలోని అశ్వనీపురంలో పర్యటించి మహిళలకు పారిశుధ్యం గురించి అవగాహన కల్పించారు. అన్ని గ్రామాలను మెరుగైన పారిశుధ్య గ్రామాలుగా మార్చాలన్నారు. అందుకుగాను ప్రతి ఇంటినుండి తడిచెత్తను, పొడిచెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లను అందించాలన్నారు. గ్రామాల్లో ఎక్కువ కాలుష్యానికి కారణభూతంగా ఉన్న ప్లాస్టిక్‌తో తయారైన క్యారీబ్యాగులు, ప్లాస్టిక్ పేపర్లు తదితరాలను వినియోగించరాదని ఆయన సూచించారు. సింగిల్‌యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంపై అవగాహనా కార్యక్రమం చేపట్టామని ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈనెల 15వ తేదీన 3వ శనివారం ఈ విషయమై అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలందరి భాగస్వామ్యంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి డేవిడ్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజల తాగునీటి సరఫరాకు మెరుగైన చర్యలు తీసుకుంటున్నాం




- ఇక నుంచి బుచ్చి పట్టణంలో ఉదయం 5 నుంచి 8 వరకు సాయంత్రం 5 నుంచి 8 వరకు తాగునీటి సరఫరా
- బర్త్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు స్థానిక సచివాలయాల ద్వారా తీసుకోవచ్చు
- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి
- ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చి పట్టణంలో తాగునీటి సరఫరావేళలు మారుస్తున్నట్టు ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ప్రకటించారు. స్థానిక నగర పంచాయతి కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్‌తో కలిసి నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిరంతరం నీటి సరఫరాతో నీరు వృధా కావడమే కాకుండా మోటార్లు కాలి పోతున్నాయన్నారు. ఈ కారణంగా నిర్ణీత సమయాలలో మాత్రమే తాగు నీరు సరఫరా చేసేలా నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఎన్నో అనర్థాలకు కారణమయ్యే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యర్థ పదార్థాలు డ్రైనేజి కాలువల్లో వేయకుండా సమీప ప్రాంతాలలోని డస్ట్ బిన్స్‌లో వేస్తూ పారిశుధ్య సిబ్బందితో సహకరించాలని కోరారు. వ్యర్థాలు సైడు కాలువలలో వేసిన కారణంగా మురుగు నీటి ప్రవాహానికి అంతరాయం కలగడంతో దోమల వ్యాప్తి చెందుతున్నాయన్నారు. దోమల బెడద నుంచి రక్షణ పొందాలంటే ప్రజలు పారిశుధ్య సిబ్బందితో సహకరించాలని ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి బుచ్చి ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

## ఏఎస్‌పేట క్రాస్‌రోడ్ వద్ద..

# బస్‌షెల్టరు నిర్మించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు సమీపంలోని ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలని జనాలు పదేపదే కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఏఎస్‌పేటలో శ్రీశ్రీశ్రీ ఖాజా రహంతుల్లా నాయబ్ రసూల్ దర్గా ఉండడంతో ప్రముఖ యాత్రాకేంద్రంగా ఉంటూ ప్రతి శుక్రవారం వందలాదిగా ఏడాదికొకదపా జరిగే గంధమహోత్సవం సందర్భంగా లక్షలాది మంది ప్రయాణీకులు విచ్చేస్తుంటారు. అదీగాక మండల కేంద్రం కావడంతో గ్రామాల నుండి పలువురు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అది కూడలి కావడంతో బస్సులు మారే ప్రయాణీకులు అక్కడ వేచి ఉండేందుకు బస్‌షెల్టరు అత్యంతావశ్యకం కాగా పదేపదే ప్రయాణీకులు కోరుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన, మండల కేంద్రమైన ఏఎస్‌పేటకు రాకపోకలు సాగించే ప్రయాణీకుల కోసం ఒక బస్‌షెల్టరు నిర్మించేందుకు ప్రాధాన్యతాక్రమంలో సంబంధిత అధికారులు స్పందించాలని, చర్యలు తీసుకోవాలని వివిద ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు కోరుకుంటున్నారు.

# ఇగో పై అవగాహన అవసరం




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం కళ్యాణ మండపంలో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో సహ యోగ అభ్యాసకులకు పర్సనాలిటీ డెవలప్మెంట్‌లో మైండ్ ఫిట్ నెస్, ఇగోలను గురించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గుంజి నాగభూషణం అవగాహన పరచడం జరిగిందని యోగా ట్రైనింగ్ మాస్టర్ జ్యోతి రాజేంద్ర కుమార్ తెలిపారు. పతంజలి యోగా సమితి బుచ్చిరెడ్డిపాళెంలో యోగాను, ధ్యానాన్ని వ్యాప్తి చేయడానికి సర్టిఫికేట్ కోర్సును ప్రారంభించింది. అందులోని అభ్యాసకులకు వ్యక్తిత్వ వికాసం గురించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గుంజి నాగభూషణం మైండ్ ఫిట్ నెస్, ఇగోలను గురించి అవగాహన పరచారు. మన మైండ్ మన కంట్రోల్‌లో వుంటే అద్భుతాలు సాధించవచ్చని ఉదాహరణలతో వివరించారు. ఇగోల వలన సమాజంలో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని కాబట్టి ఇగో పట్ల అవగాహన కలిగి వుండాలని సూచించారు. ఇగోలు.. పారెంటల్ ఇగో, అడల్ట్ ఇగో, చైల్డ్ ఇగో అని 3 రకాలని తెలిపారు. ఆశించినభాష మాట్లాడమే అడల్ట్ ఇగో అని అందరూ అడల్ట్ ఇగోని కలిగి వుండాలని తెలిపారు. యోగా సమితి సభ్యులు గుబ్బా లక్ష్మీనారాయణ, కల్లూరి బ్రహ్మయ్య, డా ఎన్‌వి రాజు, పరమేశ్వర్రావులు మాట్లాడుతూ.. నాగభూషణం ఇగోలను గురించి చక్కగా ఉదాహరణలతో వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి శివకుమార్, శ్రీనివాసులు, ప్రసాద్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ హాస్పిటల్స్‌లో ఆయుష్ వైద్య సేవలు

# అందుబాటులోకి తేవాలి

- బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ మహేంద్ర యాదవ్ కలిసి వినతి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండే అన్ని ఆర్టీసీ హాస్పిటల్‌లలో ఆయుష్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొని రావాలని స్టేట్ ఆయుష్ కమిషనర్ డాక్టర్ మంజులా డి హెూష్మనిని బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ మహేంద్ర యాదవ్ కలిసి వినతి పత్రం సమర్పించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుష్ వైద్యం ద్వారా ఉపశమనం లభిస్తుందని, రాష్టం వ్యాప్తంగా ఉండే అన్ని ఆర్టీసీ హాస్పిటల్లలో ఆయుష్ డాక్టర్ల ద్వారా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని మహేంద్రయాదవ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం అన్ని అల్లోపతి హాస్పిటల్స్‌లో ఆయుష్ వైద్యాన్ని అనుబంధ సేవలనుగా చేర్చి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తుందని, అదేవిధంగా రాష్ట ఆర్టీసీ హాస్పిటల్స్‌లో ఆయుష్ వైద్య సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా చాలా మంది ఆయుష్ వైద్యం చదివిన డాక్టర్లకు ఉద్యోగాలు రావడం వల్ల నిరుద్యోగ సమస్య తగ్గి ప్రజలకు సైడ్ ఎఫెక్ట్స్ లేని నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని అభిప్రాయపడ్డారు. కమిషనర్ కూడా ఈ ప్రతిపాదన మీద సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఆత్మకూరుకు రాని బస్సులతో ప్రయాణీకుల అవస్థలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి రహదారి ఉంది.. బైపాస్‌రోడ్డు ఉంది. డివిజన్, మున్సిపల్, నియోజకవర్గ కేంద్రంగా ఉంది. అయినా అనేక ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రావు. రెండుదశాబ్దాలకు పైగా పోరాటాలు చేసిన ప్రయాణీకులు, సమావేశాలు నిర్వహించిన నాయకులు, ప్రజాప్రతినిధులు అలసి పోయారు. కానీ ప్రయాణీకుల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అగచాట్లు తప్పడం లేదు. అదనపు భారం అనివార్యంగా ఉంది. ఇదంతా నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణ పరిస్థితి. నెల్లూరూముంబాయి రహదారికి 3కిలోమీటర్ల దూరంలో ఆత్మకూరు పట్టణం ఉంది. అదే ఈపట్టణానికి రవాణాపరంగా శాపంగా ఉందని సర్వత్రా భావిస్తున్నారు. గతంలో అన్నీ ఆర్టీసీ బస్సులు జాతీయరహదారిపై నెల్లూరుపాళెం కూడలినుండి ఆత్మకూరు పట్టణంలోకి వచ్చి వెళుతుండేవి. వచ్చి వెళ్ళడానికి ఓ 10నిముషాల సమయం పడుతుంది. కానీ కొంతకాలం క్రితం ఇతర జిల్లాలకు చెందిన బస్సులను బైపాస్‌రైడర్లు అంటూ ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా నెల్లూరుపాళెం నుండే రాకపోకలు సాగించసాగారు. క్రమీణా ఈజిల్లాలోని ఉదయగిరి, వాకాడు, నెల్లూరు డిపోలకు చెందిన బస్సులు కూడా పట్టణంలోకి రాకుండా నేరుగా నెల్లూరుపాళెంమీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన కర్నూలు, కడప,అనంతపురం,బనగానపల్లి, పుట్టపర్తి, కళ్యాణదుర్గం తదితర డిపోల బస్సులు, ఉదయగిరి, నెల్లూరు, వాకాడు డిపోలకు చెందిన బస్సులన్నీ ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా వెళుతుండడంతో ప్రయాణీకులు ఆయా ప్రాంతాలకు వెళ్ళాలంటే నెల్లూరుపాళెంకు చేరుకొని బస్సెక్కాల్సి ఉంది. ఆయా ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు నెల్లూరుపాళెం వద్ద దిగాల్సి ఉంది. నెల్లూరుపాళెం నుండి 20రూపాయల అదనపుభారం వెచ్చించి ప్రయాసతో ఆటోల్లో ప్రయాణించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇతర జిల్లాలకు చెందిన బస్సులు రాత్రివేళల్లో, అర్ధరాత్రి, తెల్లవారుఝామున నెల్లూరుపాళెంకు వస్తుంటాయి. ఆసమయంలో దిగే ప్రయాణీకులు తీవ్రంగా ఇబ్బందిపడుతుంటారు. ఎవరైనా దూరప్రాంతాల నుండి ఆయా బస్సుల్లో వచ్చేవారు ఆసమయంలో ఆటోలు లేక కూడా ఇబ్బంది పడుతుంటారు. అప్పుడప్పుడూ కొందరు విద్యార్థినిలు, ఉద్యోగినిలు ఒంటరిగా వచ్చి అక్కడ దిగుతుంటారు. ఆసమయంలో వారి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంటుంది. ఓవైపు ఆటోలకు అదనపు వ్యయం చేయడం, రాత్రివేళ ఆందోళనకు గురవుతుండడం, కనీసం జిల్లాలోని ఉదయగిరి మార్గానికి వెళ్ళాలన్నా ఆటోలో నెల్లూరుపాళెంకు వెళ్ళాల్సి రావడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకుంటోంది. ఈపరిస్థితిని గమనించిన ఆత్మకూరుకు చెందిన ప్రముఖ నాయకుడు అల్లారెడ్డి కృష్ణారెడ్డి రెండుదశాబ్దాలక్రితమే ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడం తోపాటు సంవత్సరాల తరబడి పోరాటం చేశారు. 2009లో ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర ఆర్థికశాఖామంత్రిగా వ్యవహరించిన ఆనం రామనారాయణరెడ్డి ఈపరిస్థితిని గమనించి అప్పట్లో ఆర్టీసీ రీజనల్, జోనల్, డివిజన్, డిపో స్థాయి అధికారులతో ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రయాణీకులను రప్పించి ఇతర జిల్లాల, ఇతర డిపోల బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రానందున ఎంతగా ఇబ్బందిపడుతున్నారో వివరించారు.

# శ్రీవారి సేవలో దిల్ రూబ చిత్ర బృందం



**తిరుమల, మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దిల్ రూబ చిత్ర బృందం దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో సినీ కథానాయకుడు కిరణ్ అబ్బవరం, సినీ దర్శకుడు విశ్వ కరణ్, సినీ కథానాయకిలు నజియా దవిసోన్, రుక్షర్ దీల్లోన్ లు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల కిరణ్ అబ్బవరం మీడియాతో మాట్లాడుతూ తాను కథానాయకుడిగా నటించిన దిల్ రూబ సినిమా శుక్రవారం విడుదల కనుందని తెలిపారు. ప్రతి సినిమా విడుదలకు ముందు స్వామి వారి ఆశీస్సులు పొందడం అనవాయితీగా వస్తుందన్నారు. దిల్ రూబ మూవీ అందరికీ నచ్చుతుందని, మూడు సినిమాలు ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉందని చెప్పారు. త్వరలోనే వాటిని ప్రకటిస్తామని తెలిపారు.

# సీఎంను కలిసిన టీటీడీ బోర్డు మెంబర్ సభ్యులు శాంతారామ్



**కుప్పం, మేజర్‌న్యూస్ :** పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు శాంతారామ్ తన కుటుంబ సమేతంగా సీఎం చంద్రబాబు నాయుడును గురు వారం మర్యాద పూర్వకంగా కలి శారు. తిరుమల తిరుపతి దేవ స్థానం ప్రత్యేక ప్రసాదాన్ని ముఖ్య మంత్రికి అందజేసారు. ఈ సందర్భంగా సి.ఎం శాంత రామ్‌తో ఆప్యాయంగా మాట్లా డుతూ పుట్టిన రోజు శుభాకాం క్షలు తెలిపారు. శాంతారామ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులు పొందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి అభివృద్ధికి నాయీ బ్రాహ్మణ కులస్థుల అభివృద్ధికి ముఖ్యమంత్రి 12 రకాల పథకాలను అందించి, ఇప్పటికే దేవాలయాలలో పని చేస్తున్న నాయీబ్రాహ్మణ కులస్థులకు వేతనాలు పెంచడంతో పాటు.. రాష్ట్రంలోని 1200 దేవాలయల కమిటి సభ్యులుగా నాయిబ్రాహ్మణులకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.అదే విధంగా టీటీడీ పాలక మండలి సభ్యులు శాంతరామ్ అభిమానులు, అనుచర గణం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కుప్పం పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు అన్నదాన కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు.

## మున్సిపాలిటీలో బహిరంగ వేలం

**పలమనేరు, మేజర్‌న్యూస్ :** పలమనేరు పురపాలక సంఘ కార్యాలయం నందు 13-3-2025న ఉదయం జరిగిన బహిరంగ వేలంలో ఈ క్రింది వారు హెచ్ పాట పాడి ఉన్నారు. ఇందులో వాటి వివరాలు భూమి దొడ్డి చెరువు ఎం.మార్ కొండయ్య, 1,51,000 జీఎస్టీ27,180 మొత్తం 178,180, చింత చెట్లు ఈ శ్రీనివాసులు 2,650, జీఎస్టీ 477 మొత్తం 3,127 మొత్తం 1,53, 650, జీఎస్టీ 27, 657, మొత్తం1,81,307 నీళ్ల కుంట చెరువు డాక్టర్ వైయస్సార్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాప్ నెంబర్ 12 జే ఆర్ వై మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాప్ నెంబర్ 11 లకు మాంసపు దుకాణంలో రూమ్ నెంబర్ 2 కు సరైన డిపాజిట్ దారులు లేనందున వాయిదా వేయడం జరిగింది.

**15న పురపాలక సంఘం సాధారణ సమావేశం :** ఈనెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు పలమనేరు పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాలు నందు సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరుపబడును కావున మున్సిపల్ వైస్ చైర్మన్ గుల్జార్, టు రవి, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

## ఛలో పిఠాపురం జనసేన పార్టీ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ సభకు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జి వినుత కోటా ఆదేశాలు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 4 మండలాలు పట్టణంనకు సంబంధించిన జనసేన పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు వీర మహి ళలు, జన సైనికులు ఆధ్వర్యంలో 4 బస్సులు, 50కార్లల్లో బయలుదేరారు.

## గంజాయి కలిగిన ఇద్దరు అరెస్టు

తిరుపతిరూరల్, మేజర్‌న్యూస్: రూరల్ మండలం ప్రోహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో గురువారం అవిలాలకు చెందిన వెంకటేష్, సాయి తేజల వద్ద 600 గ్రాముల కలిగిన గంజాయి ఉండడంతో రూరల్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేయగా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తిరుపతి వారు 15 రోజులు రిమాండు విధించారు.

## వైసీపీది యువత పోరు కాదు.. దగా పోరు

**పలమనేరు, మేజర్‌న్యూస్ :** వైసీపీ "యువత పోరు" పేరుతో తలపెట్టిన కార్యక్రమం చాలా హాస్యాస్పదంగా ఉందని పలమనేరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మురళి అన్నారు. పలమనేరు టీడీపీ కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గురువారం విలేకరుల సమావేశం జరి గింది. సమావేశంలో మురళి మాట్లాడుతూ 2014-2019 అప్పటి టిడిపి పాలనలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తే.. జగన్ రెడ్డి పాలనలో దానిని కుదించి కాలయాపన చేస్తూ 7 లక్షల పేద విద్యార్థులను మోసగించిందని విమర్శించారు. ఈ విషయం పై వైసిపి నేతలు సిగ్గు లేకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు?. వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన బకాయిల కారణంగా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిబుల్ ఐటీ ఇతర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఎన్నో కష్టాలు పడ్డారని గుర్తుచేశారు. ఉన్నత విద్య చదివే అవకాశం లేకుండా విద్యార్థులు ఎన్నో ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నారు. ఐదేళ్లలో ఏడాదికి నాలుగు విడతలు ఎగ్గొట్టి కేవలం ఫీజులకే 4,271 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టింది ఎవరని ప్రశ్నించారు? చెల్లించని ఫీజులకు కూడా పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చి దగా చేసింది వైసీపీ ప్రభుత్వం అన్నారు. మీ మాయ మాటలు నమ్మే పరిస్థితుల్లో నేటి యువత లేదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సునీల్ రాజు, సతీష్ కుమార్,యశ్వంత్,మహేష్ బాబు, బాలవిన్, మురళి, కుమార్ అనిల్ కుమార్, గణేష్ , గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ లోన్‌లకు 252 మంది హాజరు

**తడ, మేజర్‌న్యూస్ :** మండల కార్యాలయం నందు గురువారం నిర్వహించి న బీసీ కార్పొరేషన్ లోన్ లకు ఇంటర్వ్యూలను యు బి ఐ బ్యాంక్ మేనేజర్ ఎంపీడీవో ఎన్ విజయకుమార్ ఎంపీపీ కెలవి రఘురెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల అప్లై చేసుకున్న 277 మందికి గాను అందులో నలుగురి అప్లికేషన్ తిరస్కరించగా మిగిలిన 273 మందికి గాను 252 మంది హాజరైనట్లు అందులో 21 మంది ఇంటర్వ్యూకి గైర్హాజరైనట్లు ఎంపీడీవో ఇన్ విజయ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా కార్యాలయం రాలేటువంటి దివాంగులకు వారి కార్యాలయం బయటనే ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు త్వరలో వీరందరికీ ప్రభుత్వం లోన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

## రంగనాథునికి పల్లకి, హనుమంత సేవ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం నందు గురువారం ఉదయం పల్లకి సేవను వెన్నతాలిని ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారికి హనుమంత సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామి వారి పేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఉదయకర్తలుగా కీర్తిశేషులు మాగుంట రాఘవరెడ్డి, మాగుంట సుబ్బరామిరెడ్డి, మాగుంట సుధాకర్ రెడ్డి, మాగుంట విజయరెడ్డి జ్ఞాపకార్థం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది ఇంకా ఆలయ అర్చకులు పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## దేవాలయంకు విరాళంగా వీల్ చైర్



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం నందు స్వామివారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారం రంగనాథ భక్త మండలి, శ్రీ రాజరాజేశ్వరి భక్తిమండలి వారు దేవస్థానం కు వీల్ చైర్‌ను వయోవృద్ధుల భక్తుల కొరకు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంకు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసరు జే.శ్రీనివాసరావు, దేవస్థాన కార్య నిర్వహణాధికారి అళ్ళ శ్రీనివాసరెడ్డి, చైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, మెంటా రామ్మోహన్, రాజేంద్రప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహాలకు అదనపు ఆర్థికసాయం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2016-17 నుండి 2023-24 వరకు, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) 2016-17 నుండి 2021-22 మధ్యకాలంలో మంజూరైన బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సహాయం అందించనుంది. ఈ సహాయం కింద, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు ప్రభుత్వం మంజూరు చేయనుంది. ప్రస్తుతం వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేసేందుకు ఈ సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అధికారుల ప్రకారం, అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తక్షణమే తమ గృహ నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం సంబంధిత శాఖలను సంప్రదించాలని సూచించారు.

## వీఎస్‌యూ డిగ్రీ పరీక్షలు

▶ హాజరు అధికం, 5 మంది డీబార్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 36 మంది, నాలుగవ సెమిస్టర్‌కు 7717 మంది హాజరయ్యారు. పరీక్షా నిబంధనలు ఉల్లంఘించిన 5మంది విద్యార్థులను డీబార్ చేశారు.నెల్లూరులో 1, కావలిలో 4, అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి స్పష్టం చేశారు.

## టీటీడీ సీవీఎస్వోగా వి.హర్షవర్ధన్ రాజు బాధ్యతలు

**తిరుమల, మేజర్‌న్యూస్ :** టీటీడీ సీవీఎస్వోగా గురువారం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించిన వి.హర్షవర్ధన్ రాజు. గురువారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. హర్షవర్ధన్ రాజుకు శ్రీవారిచిత్రపటం, తీర్థ ప్రసాదాలను డిప్యూటీ ఈవో అందించారు.

# డీసీపల్లిలో పూరి గుడిసెలు దగ్ధం

● అదే ప్రమాదంలో పేలిన సిలిండర్లు ● వీధిన పడ్డ వలస కూలీలు ● మానవత్వం చాటుకున్న తహసిల్దార్





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మరిపాడు మండలంలోని డీసీ పల్లిలో గురువారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. పొగాకును క్యూరింగ్ చేసేందుకు వచ్చినటువంటి వలస కూలీలు ఏర్పాటు చేసుకున్న పూడి గుడిసెలు దగ్ధమైపోయాయి. ఒక్కసారిగా మంటలు చెల్లరేగడంతో గుడిసెల్లో ఉన్నటువంటి కూలీలు బయటకు పరుగులెత్తారు. ఎక్కువ భాగం ఆ కూలీలు ఉదయం పూట అయినందున పనులకు వెళ్లడంతో పెద్ద ప్రమాదమే తప్పిందనుకోవచ్చు. అయితే ఆ గుడిసెల్లో ఉన్నటువంటి మూడు గ్యాస్ సిలిండర్లు కూడా ప్రమాదంలో పేలిపోయాయి. ఇంత ప్రమాదం జరిగినప్పటికీ ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో ప్రజలు, వలస కూలీలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేశారు.

### మానవత్వం చాటుకున్న తహసిల్దార్

డీసీపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ వలస కూలీలు కట్టుబట్టలతో ఉండటం చూసి దుస్తులను, 10 కేజీల బియ్యాన్ని ఒక్కొక్క కుటుంబానికి అందజేశారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో కట్టు బట్టలే మిగిలాయని వలస కూలీలు బోరునఏడ్చారు. ఈ ప్రమాదాన్ని పై అధికారులకు తెలియ జేసి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తహసిల్దార్ హామీ ఇచ్చారు.

# అంగరంగ వైభవంగా ప్రసనుడి బ్రహ్మోత్సవాలు

● ఘనంగా కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి గరుడ వాహన సేవ ● శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి గరుడ వాహన సేవలో పాల్గొని స్వామి వారి వాహనాన్ని తన బుజాలతో మోసిన ఎమ్మెల్యే.. ● ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి





**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి 9వ తారీకు నుండి మొదలుకొని 15 వరకు బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగ జరుగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం రాత్రి వైభవంగా స్వామి వారు గరుడ వాహన వాహనంపై పురవీధుల్లో ఊరేగతు భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి అలంకార సేవ, మంగళనీరాజనం నిర్వహించారు. అనంతరం అర్చక పండితులు, యజ్ఞికులు, పారాయణికులు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య మేళా తాళాలతో అలంకార సేవలో గరుడ వాహనంపై ఊరేగగా, స్వామి వారిని దర్శించుకుని భక్తుల పులకించారు.గరుడ వాహన సేవలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని స్వామి వారి వాహనాన్ని తన బుజాలతో మోశారు. భక్తి శ్రద్ధలతో ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దగ్గరుండి ఎమ్మెల్యే పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడం అందులో గరుడసేవలో స్వామివారిని తన భుజాలపై మోసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా ఏడు రోజులపాటు జరిగే ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను టీటీడీ వేద పండితుల సూచనలతో ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలియజేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు కృషి చేస్తున్నారనీ తెలిపారు. ప్రతినిత్యం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి అన్నారు. ఈ పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు నైవేద్యాలతోపాటు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. అత్యంత వైభవంగా ప్రసన్నడి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలు ముగిసే అంతవరకు పోలీస్ బందోబస్తు, మున్సిపాలిటీ పర్యవేక్షణ, విద్యుత్ అధికారులు సిబ్బంది ప్రతిక్షణం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. భక్తులందరూ కూడా ఆలయ కమిటీ వారికి సహకరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా కలియుగ దైవం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామినీ దర్శించుకుని ప్రతి ఒక్కరు స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి వారి సేవకులు, భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

# కాలనీ వాసులకు చెట్టే బస్సుషెల్టర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు మజరా అంబేద్కర్‌నగర్ వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలన్న వారి అభ్యర్థన కంఠశోషగానే ఉందని వాపోతున్నారు. కాలనీ బస్టాండు వద్ద ఒక రచ్చబండ ఉండగా మద్యలో ఉన్న ఒక చెట్టే బస్‌షెల్టరుగా వినియోగించుకుంటున్నారు. ఎండల్లో సరే కానీ వర్షాకాలం ఈచెట్టు క్రింద తడిసిముద్దవుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్ళనుండి తమ బస్టాండు వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోయిందని వారు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులైనా తమ అసౌకర్యం, అవస్థ గుర్తించి ఒక బస్‌షెల్టరు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


అంబేద్కర్‌నగర్ వద్ద బస్‌షెల్టరుగా ఉన్న చెట్టు

# ఆత్మకూరు బస్టాండ్‌లను విశాలమైన ప్రాంతంలోకి తరలించాలి

▶ శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరగడం వల్ల ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్‌లను విశాలమైన ప్రాంతానికి తరలించాలని ఏపీ శాసనమండలి సమావేశాలలో గురువారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2006 నుంచి నెల్లూరు నగరం విస్తరించి మహానగరంగా అభివృద్ధి చెందుతున్నందున నెల్లూరులో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. నెల్లూరు నగరంలో ఉన్నటువంటి ఆర్టీసీ బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్లను ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా గతంలోనే వాటిని ఇతర ప్రాంతాలకు మార్చేందుకు ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. కానీ ఇప్పటివరకు నూతన బస్టాండ్ల ఏర్పాటుకు అడుగు ముందుకు పడలేదన్నారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్‌ను నెల్లూరు నగరం వెలుపల నూతన బస్టాండ్‌లను నిర్మించి వాటిని అక్కడికి తరలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్లను సిటీ బస్టాండ్లుగా వినియోగించుకుంటే ట్రాఫిక్ సమస్యను నివారించవచ్చని ప్రభుత్వానికి తెలియ చేశారు.

## సీసీ రోడ్లను పరిశీలించిన డీఈ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని హసనాపురం గ్రామంలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను గురువారం పంచాయతీరాజ్ శాఖ డీఈ ఏడుకొండలు పరిశీలించారు గ్రామంలో సుమారు 30లక్షల రూపాయలతో జరుగుతున్న సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఖాదర్ మస్తాన్ మండల టీడీపీ కన్వీనర్ అబ్బూరు రమేష్ నాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల ఆంగ్ల సామర్థ్యాలను ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి 1 షేక్ మస్తాన్ వలి పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతుల విద్యార్థుల ఆంగ్ల విషయ సామర్థ్యాలను పరిశీలిస్తూ 1, 2వ తరగతి విద్యార్థులకు ఆల్ఫాబెటికల్స్ గుర్తించి వ్రాసే విధంగా 3, 4, 5 తరగతుల విద్యార్థులు చిన్నచిన్న ఆంగ్ల పదాలను చదివి రాసే విధంగా తర్ఫీదు ఇవ్వాలని అదేవిధంగా చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. పాఠశాల యొక్క టాయిలెట్స్‌ను పరిశీలిస్తూ టాయిలెట్స్ నందు దుర్వాసనలు రాకుండా ఆయా ప్రభుత్వం వారు సరఫరా చేసిన రసాయనాలను ప్రతిరోజు ఉపయోగిస్తూ ప్రతిరోజు 4సార్లు తప్పనిసరిగా టాయిలెట్లను శుభ్రపరచాలని ఆయాకు తెలియజేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని పరిశీలిస్తూ విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి ప్రతిరోజు మెనుప్రకారం భోజనం రుచిశుచికరంగా భోజనం తయారు చేయవలెనని వంటనిర్వాహకులకు సూచించారు. అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి.జ్యోతి పాల్గొన్నారు.